
వేలం పాటలో లడ్డును దక్కించుకున్న భక్తుడు


వాడరేవులో బందోబస్తు నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు

వైభవంగా వినాయకుని నిమజ్జనాలు

చీరాల టౌన్: వినాయకచవితి పండుగ సందర్భంగా గణనాథులు నిమజ్జనాల కోసం వాడరేవుకు తరలివచ్చాయి. గత ఎనిమిది రోజులుగా పూజలందుకున్న గణనాథులకు భక్తులు వీడ్కోలు పలుకుతున్నారు. శనివారం చీరాల, పర్చూరు, అద్దంకి, చిలకలూరిపేట, నరసరావుపేట, సత్తెనపల్లి తదితర ప్రాంతాల నుంచి నిమజ్జనం కోసం వాడరేవు సముద్ర తీరానికి తీసుకువస్తున్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణనాథులను వాడరేవులోని సముద్రంలో నిమజ్జనం చేస్తుండగా తీరంలో సందడి నెలకొంది. ఈసందర్భంగా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు, బందోబస్తు నిర్వహిస్తున్నారు.

జై బోలో గణేష్ మహారాజ్ కీ..

కారంచేడు/చినగంజాం: జై బోలో గణేష్ మహారాజ్ కీ జై అంటూ భక్తులు పెద్ద ఎత్తున గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం వేకువ జాము నుంచే మండలంలోని పలు గ్రామాల్లోని గణనాథుడిని నిమజ్జనం కోసం తరలిస్తున్నారు. మండల కేంద్రం కారంచేడుతో పాటు స్వర్ణ ఉత్తర బజారు, కొత్తపాలెం, యాదవపాలేనికి చెందిన యూత్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజల అనంతరం చీరాల వాడరేవు సముద్రపు ఒడ్డున బొజ్జ గణపయ్యను నిమజ్జనం చేశారు. కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు, కొడవలివారిపాలెం, దగ్గుబాడు, ఆదిపూడి గ్రామాల నుంచి వినాయక నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి.

– చినగంజాం మండలం మూలగాని వారిపాలెంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయక విగ్రహాలను అలంకరించిన ప్రత్యేక వాహనంపై గ్రామంలోని ప్రధాన వీధుల్లో బాణాసంచా కాలుస్తూ, రంగులు చల్లుకుంటూ, డీజే సౌండ్స్‌తో ఊరేగింపు నిర్వహించి పల్లెపాలెం సముద్ర తీరంలో నిమజ్జనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

రూ.14 వేలు పలికిన లడ్డూ ధర..

పర్చూరులోని మధ్య బజారులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించినట్లు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన తులసీ శేఖర్ 32 కిలోల నేతి లడ్డుని వినాయక విగ్రహానికి అందించారు. శుక్రవారం రాత్రి లడ్డు వేలం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన కోట శ్రీనివాసరావు రూ.14 వేలకు దక్కించుకున్నారు.


పల్లెపాలెం సముద్ర తీరంలో నిమజ్జనం నిర్వహిస్తున్న యువకులు


వాడరేవు తీరంలో గణపయ్యను నిమజ్జనం చేస్తున్న భక్తులు


కారంచేడు నుంచి నిమజ్జనం కోసం బయలుదేరిన గణనాథుడు


యాదవ బజారుకు చెందిన గణనాథుడి నిమజ్జనోత్సవంలో యువకుల కేరింతలు

జాతీయ రహదారి కార్మికుల స్వచ్ఛభారత్


స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించిన రహదారి సిబ్బంది

పర్చూరు (చినగంజాం): పర్చూరులో జాతీయ రహదారిని నిర్మిస్తున్న ఆర్‌ఆర్‌ఎస్‌ఎం ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కార్మికులు బొమ్మల సెంటర్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం రోడ్లను ఊడ్చి చెత్తను తొలగించారు. పాదచారులు తడి, పొడి చెత్తలను వేయటానికి ఆకుపచ్చ, నీలం రంగులో ఉన్న పెద్ద డ్రమ్ములను ఏర్పాటు చేశారు. పనికి రాని వాటి రోడ్లపై పడవేయకుండా చెత్త కుండీలను ఉపయోగించాలని వారు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాతీయ రహదారి ప్రతినిధి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 59 కేసుల పరిష్కారం


కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయవాదులు

పర్చూరు (చినగంజాం): జాతీయ లోక్ అదాలత్‌లో 59 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి కే ప్రశాంతి తెలిపారు. శనివారం పర్చూరు కోర్టు భవనాల సముదాయంలో అదాలత్ నిర్వహించారు. ఈఅదాలత్‌లో 17 సివిల్, 42 క్రిమినల్ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించినట్లు ఆమె పేర్కొన్నారు. కేసుల పరిష్కారం ద్వారా రూ 28,37,499 నగదు రికవరీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీ శాంతి, న్యాయవాదులు రావి రమేష్‌బాబు,పీ జాన్‌బాబు, కట్టా సాల్మన్, కే ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు లారీల ఢీ-డ్రైవర్‌కు గాయాలు


లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

జే.పంగులూరు: ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టడంతో ఓలారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన శనివారం జాతీయ రహదారిపై జాగర్లమూడివారిపాలెం ఫ్లైఓవర్‌పై జరిగింది. అందిన వివరాల మేరకు.. కర్ణాటక నుంచి ఒడిషాకు టమోటో లోడుతో ఏపీ 16 టీఎస్ 1669 నెంబర్ గల లారీ ఫ్లైఓవర్‌పై వచ్చే సమయంలో ముందుగా వెళ్తున్న మరో లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో టమోటా లోడు లారీ ముందు భాగంగా నుజ్జునుజ్జయింది. లారీ నడుపుతున్న లారీ డ్రైవర్ హరీష్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. వెంటనే హైవే అంబులెన్స్ సిబ్బంది హరీష్‌ను క్రేన్ సహాయంతో తీసి క్షతగాత్రుడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆదర్శ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అతిథులు

చీరాల అర్బన్: బత్తుల సర్వీస్ ట్రస్ట్ చీరాల ఆధ్వర్యంలో శనివారం స్థానిక రోటరీ క్లబ్‌లో గురుపూజోత్సవంలో భాగంగా పది మంది ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు. సభకు ట్రస్టు అధ్యక్షుడు బత్తుల బ్రహ్మారెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ఎప్పుడూ నిత్య విద్యార్థిగా ఉండాలన్నారు. ముఖ్యఅతిథులు డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, హైకోర్టు క్రిమినల్ లాయర్ కట్టా రాజేశ్వరిలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పుస్తకాలు చదువుతూ విద్యార్థుల చేత చదివించాలన్నారు. అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం లభిస్తాయన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అవార్డు గ్రహీతలు కొణిజేటి మధుసూదనరావు, ఇమ్మిడిశెట్టి అనిత, కె.శ్రీలక్ష్మి, పి.శ్రీనివాసరెడ్డి, రావి చంద్రశేఖర్, మాగులూరి జయరావు, అమ్మనిమంచి అనిల్‌కుమార్, పాలుట్ల దేవీసుధ, భవనం కేశవరెడ్డి, ఈమని సుజాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి వడలి రాధాకృష్ణ, సీతావేణి, బీరం సుందరరావు, నాగవీరభద్రాచారి, భాగి కృష్ణమూర్తి, మున్సిపల్ కౌన్సిలర్ పొత్తూరి సుబ్బయ్య, కోడూరి ఏకాంబరేశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణ సామాజిక బాధ్యత


మార్టూరులో అవగాహన కల్పిస్తున్న హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు


అద్దంకిలో మాట్లాడుతున్న ఐసీటీసీ కౌన్సిలర్ రమేష్

మార్టూరు: ప్రాణాంతక వ్యాధి ఎయిడ్స్ నిర్మూలన సమష్టి బాధ్యతని.. ముందు జాగ్రత్త చర్యల వల్లనే దాని నిర్మూలన సాధ్యమని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐ బీవీ సాగర్ అన్నారు. బాపట్ల జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రాయల్ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి యువత మాదకద్రవ్యాల మత్తులో విచ్చలవిడి శృంగారానికి పాల్పడుతూ ప్రాణాంతక వ్యాధికి గురవుతున్నారని, సురక్షితమైన శృంగారమే దీనికి విరుగుడు అని తెలిపారు. కలుషిత రక్త మార్పిడి అపరిశుభ్రత కలిగిన సూదుల వాడకం కూడా ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తికి కారణాలు అవుతాయన్నారు. వ్యాధి సోకిన వారికి అన్ని ప్రభుత్వాసుపత్రుల్లోని ఏఆర్టీ సెంటర్లలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. టోల్ ఫ్రీ నంబర్ 1097 ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని సాగర్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అంకమ్మ చౌదరి, హెల్ప్ సంస్థ ప్రతినిధులు కే దుర్గ, రూతు, సల్మా, ప్రమీల కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సురక్షిత లైంగిక అలవాట్లు కలిగి ఉండాలి

అద్దంకి: ప్రతి ఒక్కరు కండోమ్, సురక్షిత లైంగిక అలవాట్లపై అవగాహన కలిగి ఉండాలని అద్దంకి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఐసీటీసీ కౌన్సిలర్ జి.రమేష్ పేర్కొన్నారు. జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐ ప్రాజెక్టర్ సాగర్ ఆధ్వర్యంలో అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లోని ప్రయాణకులకు మీకు తెలుసా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రయాణికులకు కండోమ్ వినియోగం, సురక్షిత లైంగిక అలవాట్లపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అద్దంకి ఔటరిచ్ వర్కర్లు కరుణ, శ్రావణి, పీఈలు మల్లేశ్వరి, శివపార్వతి, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందంజ


వాలీబాల్ ఆడుతున్న యూటీఎఫ్ నాయకులు

చీరాల అర్బన్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందంజలో ఉంటుందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జడ వినయ్‌కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర శాఖ పిలుపు మేనరకు జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ఇండోర్ గేమ్స్‌ను గత ఆదివారం కొత్తపేటలోని రావి జయలక్ష్మి సుబ్బారాయుడు ఫంక్షన్ హాలులో క్యారమ్స్, షటిల్, చెస్ పోటీలు నిర్వహించారు. శనివారం స్థానిక ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్ ప్రాంగణంలో అవుట్ డోర్ గేమ్స్ నిర్వహించారు. విద్యా వ్యవస్థ బాగోగులను ఎప్పుడూ దిశా నిర్దేశం చేస్తుందన్నారు. 50 ఏళ్ల కాలంలో అద్భుతంగా పనిచేసి రాష్ట్రంలోనే పెద్ద సంఘంగా ఏర్పడిందని, భవిష్యత్‌లో మరో 50 సంవత్సరాలు ఇదే విధంగా సంఘాన్ని ముందకు తీసుకెళ్లడంలో కార్యకర్తలందరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ముందుకు జాతీయ వామపక్ష నాయకులు సీతారాం ఏచూరికి బాపట్ల జిల్లా కమిటీ నివాళులర్పించారు. వాలీబాల్, క్రికెట్, 100, 200 మీటర్ల పరుగుపందెం, జావెలిన్ త్రో, షాట్‌పుట్ నిర్వహించారు. గెలిచిన విజేతలను రాష్ట్ర స్థాయిలో అక్టోబర్ 4,5,6 తేదీల్లో జరిగే పోటీలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు సిద్ధం పాపారావు, ఉపాధ్యక్షులు బండి బిక్షాలుబాబు, కోశాధికారి మచ్చ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శులు ఎంవీబీ సుబ్రహ్మణ్యం, మద్దాల సురేష్, కోటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ పి.సురేష్, కుర్రా శ్రీనివాసరావు, మండల, పట్టణ శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం


చీరాలలో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి సుధ

చీరాల రూరల్: రాజీ మార్గమే రాజమార్గమని, లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పులే అంతిమ తీర్పులని న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు భవన సముదాయంలో ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ అదాలత్‌లో న్యాయమూర్తులు 90 కేసులు పరిష్కరించారు. వాటిలో క్రిమినల్ కేసులు 58, ఎగ్జిక్యూషన్ పిటీషన్ కేసులు 3, ఒరిజినల్ మనీసూట్‌లు 14, ప్రీలిటిగేషన్ కేసు 1, భరణం కేసులు 2, గృహ హింస కేసులు 2, చెక్‌బౌన్స్ కేసులు 3 పరిష్కరించారు. రెండు బెంచ్‌లుగా ఏర్పాటు చేసిన అదాలత్‌లో మొదటి బెంచ్‌కు సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ ప్రిసైడింగ్ అధికారిగా, రెండో బెంచ్‌కు ప్రిసైడింగ్ అధికారిగా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహనలు వ్యవహరించారు. అదాలత్‌కు మెంబర్లుగా న్యాయవాదులు బి. వినీల, జి. కోటేశ్వరమ్మ, పారా లీగల్ వలంటీర్ జెవి. సాయికృష్ణ, ఎస్‌డీ. మతీన్‌లు వ్యవహరించారు.

అద్దంకి రూరల్: అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి డి నాగ వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈఅదాలత్‌లో అన్నారు. క్రిమినల్ 85, ఈపీ 8, ఎస్ఐ యాక్ట్ 3, డీవీసీ 1, ఎంసీ 9, హెచ్‌ఎంటిపి 1, ఎస్‌టీసీ 372, 1976 నాటి పాత కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో మొదటి బెంచ్ న్యాయవాదులు టి.అనూష, టి. మాత్ర శ్రీను, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి సీత, న్యాయవాదులు ఆకుల సత్యవతి, డి హయగ్రీవాచారి పాల్గొన్నారు.

ట పంచాయితీ సిబ్బంది, కార్మికులు ఉన్నారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకోవాలి


ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో విద్యార్థుల ప్రదర్శన

చీరాల: స్థానిక వీఆర్‌ఎస్‌వైఆర్‌ఎన్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని కళాశాలలో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకునే క్రమంలో కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఎక్స్‌లెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎక్స్‌లెన్స్ సెంటర్‌ను యలమంచలి విద్యాసంస్థల సీఈఓ రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక ఆవిష్కరణ కర్తగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం


ఉపాధ్యాయుడు శ్రావణ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సంతమాగులూరు (అద్దంకి): భారత రాజ్యాంగం హిందీని అధికార భాషగా గుర్తించిన రోజునే హిందీ దివస్‌గా జరుపుకుంటామని ఉపాధ్యాయుడు ధర్మవరపు శ్రావణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సభలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్. ఎం రహమాన్ పాఠశాలలో నేర్చుకునే హిందీతో పాటు ఓరియంటల్ హిందీ కూడా అవకాశం ఉందని తెలియజేశారు. మరో హిందీ ఉపాధ్యాయుడు నరేంద్రకుమార్, స్వాగత సందేశం ఇవ్వగా, హిందీలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. తరువాత విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నృత్యరూపకాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సభలో విద్యార్థులు హిందీలోనే ఉపన్యాసాలు, పాటలు, సంభాషణలు చేశారు. తరువాత హిందీ ఉపాధ్యాయుడు శ్రావణ్‌కుమార్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

మేదరమెట్ల (అద్దంకి రూరల్): మండలంలోని కుర్రావానిపాలెం గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ నాదెండ్ల దశరథరామయ్య, డాక్టర్ కట్టా సాయితేజ, గ్రామ నాయకుడు కోట శ్రీనివాసులు ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. పరిసర గ్రామాలు నుంచి 250 మంది ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యుడు రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

వాగులో పడి లారీ బోల్తా


వాగులో పడిన మినపగుండ్ల లారీ

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ఆగిఉన్న మినపగుండ్ల లోడు లారీని మరోక లారీ వెనుకనుంచి ఢీకొట్టటంతో లోడు లారీ వాగులోకి దూసుకెళ్లింది. ఈఘటన శనివారం సంతమాగులూరు మండలంలోని పాత మాగులూరు వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు విజయవాడ నుంచి ప్రొద్దటూరుకు వెళుతున్న మినపగుండ్ల లోడు లారీ మరమ్మతులకు గురికావటంతో పాతమాగులూరు సమీపంలోని బొద్దుల వాగు వద్ద నిలిపి మరమ్మతులు చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో వెనుకనుంచి వస్తున్న ఢీకొట్టటంతో నిలిచి ఉన్న మినపగుండ్ల లారీ ముందుకు దూసుకుపోయి వాగులో పడింది. అందులో ఎవరు లేనపోవటంతో ప్రాణనష్టం కలగలేదు. లోడు మొత్తం వాగులో పడింది.